సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం



కరీంనగర్‌కల్చరల్: నగరంలోని గాంధీరోడ్ వైశ్యభవన్‌లో ఆదివారం వైశ్యసేవా కేంద్రం ఆధ్వర్యంలో వల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం నిర్వహించారు. ఈయేడు కుజుడు రాజు కావడంతో ఆయన ఆరాధ్యదైవం సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ఆరాధిస్తే సకల జనులకు శుభ ఫలితాలు కలుగుతాయని మహేశ్వరశర్మ అన్నారు. 21 మార్లు హనుమాన్ చాలీసా పారాయణాలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం తాహెర్‌కొండాపూర్ గ్రామంలో ఆదివారం పోచమ్మ పట్నాలు, బోనాల పండుగ నిర్వహించారు. బైండ్ల పూజారులు పోచమ్మ ఆలయంలో పట్నం వేసి ప్రత్యేక పూజలు చేశారు. ఇంటికో బోనం చొప్పున మహిళలు బోనాలతో శివసత్తుల పూనకాలు, డప్పు చప్పుళ్ల నడుమ ఊరేగింపుగా పోచమ్మ ఆలయానికి తరలివెళ్లారు. అనంతరం బోనం సమర్పించి మొక్కులు చెల్లించారు.



పారాయణాల్లో భక్తులు



ప్రత్యేక పూజల్లో శ్రీరమణీరంగాచార్యస్వామి

అభిషేకాలు.. పారాయణాలు

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని శాతవాహన యూనివర్సిటీ వద్ద గల బీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఉత్సవ నిర్వహణ సమితి, యతిరాజ సేవా మండలి, వికాసతరంగిణి విద్యానగర్ ఆధ్వర్యంలో జరుగుతున్న సవాహ్నిక ఏకకుండాత్మక శ్రీమద్రామాయణ మహాక్రతువులో భాగంగా ఆదివారం సాలగ్రామ అభిషేకం, కుంభారాధన, అగ్నిమధనం, హవనం, వేద, ఇతిహాస, పురాణ, స్తోత్ర, దివ్య ప్రబంధ పారాయణాలు, వివిధ దేవతా పారాయణాలు జరిగాయి. ఉభయ వేదాంత పండితుడు తూపురాణి శ్రీరమణీరంగాచార్యస్వామి నేతృత్వంలో జరుగుతున్న కార్యక్రమంలో బల్మూరి ప్రభాకర్‌రావు, కరుణాకర్‌రావు కిశోర్‌కుమార్, శివకుమార్, ప్రసూనరావు, లక్ష్మీగిరిధర్ రావు, లావణ్యాశ్రీపతిరావు, దేవేందర్‌రెడ్డి, వంశీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లకు తగ్గిన దూరభారం

- అందుబాటులో పోలింగ్ కేంద్రాలు
- కరీంనగర్ నియోజకవర్గంలో 24పోలింగ్ కేంద్రాల మార్పు
- రెండు దశాబ్దాల ఇబ్బందులకు చెక్

కరీంనగర్‌రూరల్: లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు అధికారులు పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. కరీంనగర్ నియోజకవర్గంలో మొత్తం 395 పోలింగ్ కేంద్రాలున్నాయి. మొత్తం ఓటర్లు 3,67,353 ఉన్నారు. వీరిలో పురుషులు 1,83,186, మహిళలు 1,84,123, థర్డ్‌జెండర్ 44 ఓటర్లున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాలు ఓటర్ల నివాస ప్రాంతాలకు దూరంగా ఉండటంతో రాకపోకలకు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. అనంతరం పోలింగ్ కేంద్రాల ఇబ్బందులను గుర్తించిన అధికారులు ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లకు అనుకూలంగా పోలింగ్ కేంద్రాలను మార్చారు. పోలింగ్ కేంద్రం ఓటర్లకు రెండు కిలోమీటర్ల పరిధిలో ఉండేలా ఏర్పాటు చేశారు. గత అసెంబ్లీ ఎన్నికలప్పుడు మొత్తం 390 పోలింగ్ కేంద్రాలుండగా ప్రస్తుతం అదనంగా మరో ఐదు కేంద్రాలను ఏర్పాటు చేయడంతో కేంద్రాల సంఖ్య 395కు పెరిగింది. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలను కల్పించారు.

24 పోలింగ్ కేంద్రాల మార్పు

ప్రస్తుత లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకుని అధికారులు కరీంనగర్ నియోజకవర్గ పరిధిలో మొత్తం 24 పోలింగ్ కేంద్రాలను మార్పు చేశారు. రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పోలింగ్ కేంద్రాలను సమీప ప్రాంతాలకు, శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను గుర్తించి మరో ప్రాంతంలోని పాఠశాలలకు మార్పు చేశారు.

రెండు దశాబ్దాల సమస్యకు పరిష్కారం

కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామపంచాయతీ పరిధిలోని రజ్వీచమన్, సిటిజన్‌కాలనీ, శ్రీపురం కాలనీ, విజయ్‌నగర్, సెల్ఫీనగర్ కాలనీలు కార్పొరేషన్‌కు ఆనుకుని ఉన్నాయి. ఆయా కాలనీలకు చెందిన సుమారు 4వేల మంది ఓటర్లు బొమ్మకల్, గుంటూరుపల్లి, లక్ష్మీనగర్‌లోని పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటేయాల్సిన పరిస్థితి నెలకొంది. దాదాపు రెండు దశాబ్దాల నుంచి సుమారు 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న పోలింగ్ కేంద్రాలు 121, 122, 123, 124, 125 వెళ్లేందుకు ఓటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పోలింగ్ కేంద్రాలను మార్పు చేయాలని స్థానికులు పలుమార్లు కలెక్టర్, ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేయగా పట్టించుకోలేదు. ఎట్టకేలకు ప్రస్తుత లోక్‌సభ ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలను మార్పు చేసి స్థానికంగా ఏర్పాటు చేశారు.



రజ్వీచమన్‌లోని జెమ్స్‌స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం

ప్రాంతం	పోలింగ్ కేంద్రం	పాతది	కొత్తది
నగునూరు	81	మండల పరిషత్ పాఠశాల	జెడ్పీ పాఠశాల
నగునూరు	82	మండల పరిషత్ పాఠశాల	జెడ్పీ పాఠశాల
మొగ్దుంపూర్	99	మండల పరిషత్ పాఠశాల	జెడ్పీ పాఠశాల
గుంటూరుపల్లి	121	మండల పరిషత్ పాఠశాల	సిద్ధార్థ హైస్కూల్
గుంటూరుపల్లి	122	మండల పరిషత్ పాఠశాల	జెమ్స్ పాఠశాల
లక్ష్మీనగర్	123	మండల పరిషత్ పాఠశాల	జెమ్స్ స్కూల్
అశోక్‌నగర్	205	భారతీయ విద్యానికేతన్	షాషాబీ ప్రభుత్వ పాఠశాల
అశోక్‌నగర్	206	భారతీయ విద్యానికేతన్	ఎస్ఆర్ డీజీ స్కూల్ గది
కరీంనగర్	254	ఏడీ అగ్రికల్చర్	ఖార్ఖానగడ్డలోని ఏఎంసీ
కరీంనగర్	256	ఏరువాక	ఏఎంసీ
కరీంనగర్	257	ఏరువాక	ఏఎంసీ రైతుల విశ్రాంతిగది
కరీంనగర్	297	టిట్రా మోడల్‌స్కూల్	లెజెండ్ స్కూల్
కరీంనగర్	298	టిట్రా స్కూల్	లెజెండ్ స్కూల్
భగత్‌నగర్	302	శ్రీచైతన్య కళాశాల	సిద్ధార్థ హైస్కూల్
భగత్‌నగర్	303	శ్రీచైతన్య కళాశాల	సిద్ధార్థ హైస్కూల్
భగత్‌నగర్	333	వివేకానంద విద్యానికేతన్	సెంట్రల్ వేర్‌హౌస్
భగత్‌నగర్	334	వివేకానంద విద్యానికేతన్	సెంట్రల్ వేర్‌హౌస్
గోదాంగడ్డ	341	సెంట్రల్‌వేర్‌హౌస్	సప్తగిరికాలనీ ఉన్నత పాఠశాల
గోదాంగడ్డ	342	సెంట్రల్‌వేర్‌హౌస్	సప్తగిరికాలనీ ఉన్నత పాఠశాల
మంకమ్మతోట	354	వేదం హైస్కూల్	సిద్ధార్థ హైస్కూల్
మంకమ్మతోట	355	వేదం హైస్కూల్	సిద్ధార్థ హైస్కూల్
మంకమ్మతోట	356	వేదం హైస్కూల్	సిద్ధార్థ హైస్కూల్
మంకమ్మతోట	357	వేదం హైస్కూల్	సిద్ధార్థ హైస్కూల్

ఓటర్లకు ఇబ్బంది తప్పింది



కొన్ని దశాబ్దాల నుంచి ఆయా కాలనీవాసులు ఓట్లు వేసేందుకు పడరానీపాట్లు పడ్డారు. కాలనీలకు పోలింగ్ కేంద్రాలు దూరంగా ఉండటంతో ప్రతీ ఎన్నికల్లో పోలింగ్‌శాతం తగ్గింది. ప్రస్తుతం ఐదు పోలింగ్ కేంద్రాలను ఆయా కాలనీల పరిధిలో ఏర్పాటు చేయడంతో ఓటర్లకు ఇబ్బంది తప్పింది. – సయ్యద్ ముజాఫర్, లోక్‌సత్తా ప్రతినిధి

క్లుప్తంగా

సీఎంను కలిసిన బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు



రేవంత్‌రెడ్డికి ఆశీస్సులందజేస్తున్న బ్రాహ్మణ సేవాసంఘం నాయకులు

కరీంనగర్‌కల్చరల్: సీఎం రేవంత్‌రెడ్డిని శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. సన్మానించి ఆశీస్సులందజేశారు. బ్రాహ్మణ కార్పొరేషన్ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వపరంగా సహకరిస్తామని అన్నారు. సీఎంను కలిసిన వారిలో కరీంనగర్‌కు చెందిన సమాఖ్య రాష్ట్ర కోశాధికారి సముద్రాల విజయసారథితో పాటు వర్కింగ్ ప్రెసిడెంట్ రామేశ్వర్‌రావు, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, రఘునందన్ తదితరలున్నారు.

బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారం



కరీంనగర్: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా నగరంలోని 59వ డివిజన్‌లో ఆదివారం ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సతీమణి గంగుల రజిత, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయిన్‌పల్లి వినోద్ కుమార్ సతీమణి బోయినపల్లి మాధవిలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రతీ ఇంటికి వెళ్లి బీఆర్‌ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటేసి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. బీఆర్‌ఎస్ పార్టీ ప్రభుత్వం ఉన్నప్పుడు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గందె మాధవి-మహేశ్, బీఆర్‌ఎస్ పార్టీ నాయకురాలు కర్రె పావని, డివిజన్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



కరీంనగర్ కార్పొరేషన్: గంగుల కమలాకర్ మైనార్టీ యువసేన దళం నాయకులు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. యువసేన అధ్యక్షుడు ఎండీ సర్వర్ అలీ, 60 మంది డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలకు డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు.కాంగ్రెస్‌లో చేరిన వారిలో అఫ్రోజ్, ఇస్మాయిల్, ఫిరోజ్, ఉస్మాన్, అజీమ్, రఫీఖ్, నయీమ్, జమీల్, ముక్తార్, ఖదీర్ తదితరులు ఉన్నారు.

'కోమటిరెడ్డి' జన్మదిన వేడుకలు

కరీంనగర్ కార్పొరేషన్: కాంగ్రెస్ నగర అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఆదివారం కాంగ్రెస్ నాయకులు పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఇందిరాచౌక్ వద్ద, రేకుర్తి వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేయగా.. హౌసింగ్‌బోర్డుకాలనీలోని వీరబ్రహ్మేంద్ర వృద్ధాశ్రమంలో పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కరీముల్లాషా దర్గాలో చాదర్ సమర్పించారు.

పరామర్శ



రామకృష్ణారెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్: బీజేపీ సీనియర్ నాయకుడు గుజ్జుల రామకృష్ణారెడ్డి సోదరుడు రాజనరేందర్‌రెడ్డి అనారోగ్యంతో మరణించగా ఆదివారం వారి స్వగ్రామం కమ్మరిఖాన్‌పేటలో రామకృష్ణారెడ్డిని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కన్నం అంజయ్య, నేతి రవివర్మ, మిడిదొడ్డి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మేనిఫెస్టో క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న నావికా హర్షే

కరీంనగర్ కార్పొరేషన్: లోకసభ ఎన్నికల సందర్భంగా విడుదల చేసిన కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను క్షేత్రస్థాయిలో తీసుకెళ్లాలని ఆలిండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ మేనిఫెస్టో రీసెర్చ్ విభాగం అధిపతి నావికా హర్షే అన్నారు. ఆదివారం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం అఫిషియల్స్, ప్రొఫెషనల్స్‌తో ఏర్పాటు చేసిన ముఖాముఖిలో మాట్లాడారు. దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగకరమైన మేనిఫెస్టోను కాంగ్రెస్ రూపొందించిందని తెలిపారు. ఈ మేనిఫెస్టోను ప్రతీ పల్లెకు తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు, ప్రొఫెషనల్ కాంగ్రెస్ తెలంగాణ ఇన్‌చార్జి అజీజ్, కరీంనగర్ ఇన్‌చార్జి ఫసియొద్దిన్, నవాబ్, కొరివి వేణుగోపాల్, మాసం రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇండియా కూటమిని గెలిపించేందుకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న మణికంఠరెడ్డి

కరీంనగర్: యువతకు ఉద్యోగాలు, విద్యార్థులకు ఉన్నత విద్య అందుబాటులోకి రావాలంటే ఇండియా కూటమిని గెలిపించేందుకు కృషి చేయాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి అన్నారు. ఆదివారం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశంలో మాట్లాడారు. దేశంలో యువతకు ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన మోదీ పదేళ్లలో రెండు కోట్ల ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమేశ్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారానికి దిగడం సిగ్గుచేటు

కరీంనగర్‌టౌన్: కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అమలు చేయలేక గాడిద గుడ్డు అంటూ సీఎం రేవంత్‌రెడ్డి తప్పుడు ప్రచారానికి దిగడం సిగ్గుచేటని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప, జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి మధూకర్ అన్నారు. ఆదివారం ఎంపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణకు కేంద్రం 9 లక్షల కోట్లు ఇచ్చిందని రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చినప్పటికీ తీరు మారలేదన్నారు. కటకం లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

భగీరథ గేట్‌వాల్‌ను ఢీకొట్టిన లారీ



వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం మొగ్దుంపూర్-చెర్లభూత్కుర్ రోడ్‌లోని మిషన్ భగీరథ గేట్‌వాల్‌ను ఆదివారం రాత్రి లారీ ఢీకొట్టింది. ఈ సంఘటనలో గేట్‌వాల్ విరిగి కింద పడడంతో నీళ్లన్నీ వృథాగా పోతున్నాయి. సమాచారం అందుకున్న భగీరథ సిబ్బంది గేట్‌వాల్‌ను పరిశీలించి నీటి సరఫరాను నిలిపివేశారు.

వినోద్‌కుమార్ ద్వారానే అభివృద్ధి



ప్రచారం చేస్తున్న మాజీ మేయర్ రవీందర్‌సింగ్

కరీంనగర్: బోయినపల్లి వినోద్‌కుమార్ ద్వారానే అభివృద్ధి సాధ్యమని మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ అన్నారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్‌కు మద్దతుగా ఆదివారం నగరంలోని కూరగాయల ప్రధాన మార్కెట్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిందని అన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో సంతోషంగా ఉన్న రైతులు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక సాగు, తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎంపీలు గెలిస్తే తెలంగాణ కోసం పోరాడుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, కెమసారం తిరుపతి, కొత్తకొండ శ్రావణ్, తుల భాస్కర్‌రావు, జయంత్, తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని బలపర్చండి

విద్యానగర్(కరీంనగర్): సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని బలపరుస్తూ కరీంనగర్‌లో కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును గెలిపించాలని రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరహరి జగ్గారెడ్డి అన్నారు. ఆదివారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి ఆగస్టు 15లోపు రూ.2లక్షల రుణమాఫీ వర్షాకాలం వరి ధాన్యం పంటకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తానని హామీ ఇవ్వడం హర్షనీయమన్నారు. అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో పాటు 6 గ్యారంటీలను కూడా అమలు చేస్తునందున ఈ ఎన్నికల్లో రాజేందర్‌రావును గెలిపించాలన్నారు. ఈ సమావేశంలో రెడ్డి సంఘం జిల్లా ఐక్యవేదిక అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, నాయకులు అజయ్ పాల్‌రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రెడ్డి సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలు రజితరెడ్డి, శ్రీమతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డివిజన్‌ల అభివృద్ధి కోసమే పార్టీ మార్పు



మాట్లాడుతున్న కాంగ్రెస్ కార్పొరేటర్లు, నాయకులు

కరీంనగర్ కార్పొరేషన్: తమ డివిజన్‌ల అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసమే పార్టీ మారామని కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు అన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో అభివృద్ధిలో వివక్షకు గురైన డివిజన్ కార్పొరేటర్లే తిరుగుబాటు చేశారని వెల్లడించారు. ఆదివారం నగరంలోని పద్మనాయక కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇటీవల బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన 8మంది కార్పొరేటర్లు మాట్లాడారు. ఓటమి భయంతో బండి సంజయ్, అధికారం కోల్పోయిన బాధలో గంగుల కమలాకర్‌లు మతి తప్పి తమపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. మెండి చంద్రశేఖర్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనలో తమ డివిజన్లు అభివృద్ధి నోచుకోలేదని అందుకే కాంగ్రెస్‌లో భేషరతుగా చేరామన్నారు. తమకు రూ.20 లక్షలు ఇచ్చి కొనుగోలు చేశారని బండి చేసిన ఆరోపణలు నిరూపించాలన్నారు. బండి, గంగుల ఇద్దరు తమతో పాటు కార్పొరేటర్లుగా పనిచేసిన వారేనని గుర్తు చేశారు. కోల ప్రశాంత్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో గంగుల కమలాకర్ పాత్ర లేదని, టీడీపీ నుంచి బీఆర్‌ఎస్‌లోకి రాకుంటే ఆయన ఎమ్మెల్యే అయ్యేవారు కాదన్నారు. కమలాకర్ మంత్రిగా ఉన్న రోజులు తమను పట్టించుకోలేదని అన్నారు. కాశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ గంగుల రాజకీయ భవిష్యత్‌కు పునాదిరాళ్లుగా నిలిచింది తామేనన్నారు. ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు బుద్ధి చెబుతామని, కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావును భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు చాడగొండ బుచ్చిరెడ్డి, నేతికుంట యాదయ్య, భూమాగౌడ్, ఆకుల నర్మద నర్సయ్య, భాగ్యలక్ష్మి ప్రశాంత్, పిట్టల వినోద శ్రీనివాస్, నాయకులు వైద్యుల అంజన్ కుమార్, పద్మాకర్‌రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి



మాట్లాడుతున్న ఆకునూరి మురళి

విద్యానగర్(కరీంనగర్): విద్వేష, విభజన రాజకీయాలు చేస్తున్న పార్టీలను ఓడించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి అన్నారు. ఆదివారం ఉదయం నగరంలోని ఎస్సారార్ డిగ్రీ కళాశాల మైదానంలో వాకర్స్‌తో మాట్లాడారు. రైతు మార్కెట్‌లో రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక పార్లమెంట్ ఎన్నికల్లో ఫాసిస్టు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, ఎన్డీఏ శక్తులను ఓడిద్దాం పేరుతో ముద్రించిన కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. అనంతరం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి యువతను మోసం చేసిందని ఆరోపించారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్లు పద్మజా షా, లక్ష్మీనారాయణ, జానయ్య, నాయకులు నైనాల గోవర్దన్, రాయిదాస్ రాయ్, మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎంహమ్మేశ్, కొరివి వేణుగోపాల్, డీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వి.శ్రీకాంత్, కల్పన, మార్వాడి సుదర్శన్, స్వరూప, సౌజన్య, రాణాప్రతాప్, అంజి, తిరుపతి, కుమార్,గౌస్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సన్మానం



కరీంనగర్‌రూరల్: రాష్ట్ర, జాతీయస్థాయి ఖేలో ఇండియా స్కూల్ గేమ్స్ యూనివర్సిటీ స్థాయిలో తైక్వాండోలో పలు పతకాలు సాధించిన బబ్బూరి అక్షిత, ప్రవళిక, ఎండీ ఆస్మీన్, ఆసియా, సుప్రియా, మహేశ్‌బాబు, హరీశ్, తిరుమల్‌కుమార్‌లను ఆదివారం కరీంనగర్‌లో జరిగిన సమావేశంలో యాదవ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ అధికారులు రవీందర్‌రెడ్డి, రాకేశ్‌రెడ్డి, సిద్దు, శోభారాణి, వివేకానంద స్కూల్ చైర్మన్ సొగాని కొమురయ్య, యాదవ ట్రస్టు అధ్యక్షుడు బబ్బూరి కుమార్, యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బండి మల్లన్న, మహాసభ జిల్లా అధ్యక్షుడు దుండ్ర రాజయ్య, నగర అధ్యక్షుడు గాలి రవి, నాయకులు బూస అంజయ్య, రాజయ్య, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఐటీఏ ఎస్ఆర్‌బీవీఏ ఎన్నికలు



జి.కృపాదానం

కరీంనగర్‌కల్చరల్: సీఎస్ఐటీఏ సౌత్ రీజియన్ బెనిఫిషరీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కరీంనగర్‌కు చెందిన గుంద్ర కృపాదానం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బెంగుళూరులో ఆదివారం జరిగిన చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా ట్రస్టు అసోసియేషన్ బెనిఫిషరీ వెల్ఫేర్ అసోసియేషన్ సౌత్ రీజియన్ బాడీ ఎన్నికల్లో అధ్యక్షుడిగా బీసీ రవిచంద్రన్ (తమిళనాడు), ఉపాధ్యక్షుడిగా కృపాదానం (తెలంగాణ), ప్రధాన కార్యదర్శిగా జయకుమార్ (తమిళనాడు) ఎన్నిక కాగా తెలంగాణ రాష్ట్ర బాధ్యులుగా విద్యాసాగర్, అనిల్‌రాజ్. జయపాల్, జాన్సన్ ఎన్నికయ్యారు. కాగా ఎన్నికైన వారికి పలువురు అభినందనలు తెలిపారు.

పీసీసీ లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్‌గా రజనీష్

కరీంనగర్ కార్పొరేషన్: పీసీసీ లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్‌గా కరీంనగర్‌కు చెందిన భూక్య రజనీష్ నియమితులయ్యారు. ఈమేరకు పీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం





కరీంనగర్: నగరంలోని రామకృష్ణ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో 1989–90 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులందరూ ఆదివారం కొండ సత్యలక్ష్మి గార్డెన్ వేదికగా సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. ఇంజినీర్లు, టీచర్లు, లెక్చరర్లు, వ్యాపారవేత్తలు.. ఇలా ఇక్కో రంగంలో స్థిరపడ్డ 72 మంది విద్యార్థులు 34 ఏళ్ల తర్వాత ఒకే చోట కలుసుకుని చిన్ననాటి అనుభవాలను పంచుకున్నారు. తమ జీవితంలో ఎదురుబొదుగులు, ఇప్పుడున్న స్థితిగతులను ముచ్చటించుకున్నారు. ఫొటోల రూపంలో శాశ్వతజ్ఞాపకంగా మల్చుకున్నారు. కార్యక్రమంలో కొండ రాంబాబు, ధనపురి సాగర్, బి.శేఖర్, జస్పాల్, ఇలయాజ్, కమిల్, హకీమ్, గోవర్ధన్, పావని, సునీత, శాంతి తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరు జెడ్పీ పాఠశాలలో ఆదివారం 2001–02 సంవత్సరం ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వివిధ వ్యాపారాలు, ఉద్యోగాలు చేస్తున్న పూర్వ విద్యార్థులు అప్పటి తమ తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. మృతిచెందిన అప్పటి ప్రధానోపాధ్యాయుడు సుగుణాకర్‌రావుకు సంతాప సూచకంగా మౌనం పాటించారు. అనంతరం ఉపాధ్యాయులు అనంతరాములు, బోడ మల్లారెడ్డి, శ్రీధర్‌రావు, చుక్కారెడ్డి, మధూకర్, మునీర్‌అహ్మద్, పద్మలత, రాజమణిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బి.రాజు, కె.శ్రీను, అనిల్, కరుణాకర్, రమాదేవి, శ్రీదేవి, లత, మమత తదితరులు పాల్గొన్నారు.